# ఉత్తరాల వెనుక

శ్రీ అరిగే రామారావు

అరుణ ఇచ్చిన సర్టిఫికెట్సు, ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజివాళ్ళ మెమో తీసుకుని, 'కాసేపు వరండాలో కూర్చోండి. మేనేజరుగారు రాగానే పిలుస్తాం,' అన్నాడు ఎకౌంటెంటు.

ఆ కంపెనీలో పనిచేసే ఉద్యోగస్థులు మెల్లగా ఒకళ్ల తర్వాత ఒకళ్లు వస్తున్నారు. వరండాలో కూర్చున్న అరుణను, ఎవరా ఈ కొత్త మొగం అన్నట్లుగా, వింతగా చూస్తూ లోపలికెళ్లుతున్నారు. వీళ్లందరిని ఎంతో కుతూహలంగా పరికిస్తూ, ఎకౌంటెంటు పిలుపుకోసం ఎదురుచూస్తూ కూర్చుంది అరుణ. తనకు కూడ ఈ కంపెనీలో ఉద్యోగంవస్తే తాను కూడ వీళ్లందరిలాగే ఇదే టైంకు రావాలన్నమాట! ఈ కంపెనీలోని టైపిస్టు పోస్టుకు ఎంప్లాయిమెంటు ఎక్చేంజివారు తనను డైరక్టు చేశారు. ఈరోజు ఇంటర్వ్యూ. పది గంటలు దాటిపోయినా, ఇండర్వ్యూ నిమిత్తం వచ్చినది ఇప్పటివరకు తనొకర్తే కనిపిస్తోంది. చూడబోతే పెద్దగా కాంపిటీషను లేనట్లనిపిస్తోందని అనుకుంది. గేటుముందు ఆగిన రిక్షాల్లోంచి దిగి, రిక్షావానికి డబ్బులిస్తున్న యువతిని తన క్లాసుమేటు విజయగా గుర్తించింది అరుణ. విజయ కూడ ఈ కంపెనీలోనే పని చేస్తోందేమో ననుకుంది.

విజయ మెట్లెక్కుతూ, వరండాలో బెంచీమీద కూర్చున్న అరుణను చూచి, గుర్తుపట్టి చిరునవ్వు నవ్వింది. అరుణకు తన స్నేహితురాలిని చూడగానే ప్రాణం లేచివచ్చినంత పనయింది. తనతోపాటు ఫస్టుఫారంనుండి ఎస్సెస్సెల్సీవరకు కలసి చదువుకున్న తన స్నేహితురాలు విజయ స్కూలు వదిలేసిన రెండు సంవత్సరాల తర్వాత మళ్లీ కనిపించటం, అదే విజయ ఈ కంపెనీలో పని చేస్తుండటం, ఆ కంపెనీలోని ఉద్యోగానికి తను ఇంటర్వ్యూకు రావటం—అరుణ చాల ఆశ్చర్యపడింది—ఆశ్చర్యపడవలసినంత విడ్డూరం ఏమీ లేకపోయినప్పటికి!

కాని, విజయ తనను కౌగలించుకున్నంత పనిచేసి, 'ఎన్ని రోజులకు కలిశాం అరూ! నీవు ఈ కంపెనీలో పని చేస్తున్నావా?' అని అడిగినప్పుడు ఇంకా ఆశ్చర్యపడింది.

ఇలా ఆశ్చర్యంమీద ఆశ్చర్యం వచ్చిపడిన అరుణ ఎలాగో తేరుకుని, 'కాదు, ఈ కంపెనీలో టైపిస్టు పోస్టుకు ఇంటర్వ్యూకు వచ్చాను. మరి నీవు—' అని అడిగిన దానికి—

'నేనూ అంతే'— అని చిరునవ్వుతో సమాధానం ఇచ్చింది విజయ.

"అయితే, ఇంత ఆలస్యం చేశావేం! సర్టిపికెట్సు అవి ఎకౌంటెంటుకు యిచ్చిరా. నేను ఇందాకనే ఇచ్చేశాను!"

విజయ, ఆ ఎకౌంటెంటు ఎవడో ఏమిటో నాకు తెలియదు. రావోయ్ ఇద్దరం వెళ్దాం—' అని అరుణను తన కూడ లోపలికి తీసికెళ్ళింది.

హాలులోపలనుండి ఎకౌంటెంటు సీటు దగ్గరకు మెరుపు తీగెల్లాగా నడచిపోతున్న వీళ్లిద్దర్నీ గుమస్తారాయళ్లంతా వళ్లంతా కళ్లు చేసుకుని చూశారు.

'ఈ అమ్మాయిమణుల్లో ఏ మణి మనకు టైపిస్టు కాబోతుందో?', 'ప్రేమారావు' అనబడే రామారావు, తన పక్క సీట్లోని భీమారావునుచూచి అన్నాడు.

భీమారావు ఎకౌంటెంటు టేబులు దగ్గర నిల్చున్న అమ్మాయిల బి. పి. లను (బేక్ పోర్షన్సును) ఒకసారి పరిశీలనా దృష్టితో పరికించి, 'వాలుజడ' అని సీరియస్‌గా అనేసి, మళ్లీ తన ఫైళ్లల్లోకి తలదూర్చాడు.

రామారావు కోపంగా, 'రెండు జడలు—' అన్నాడు.

భీమారావు తల ఎత్తకుండానే, 'వాలుజడ' అని కసిగా అన్నాడు.

'రెండు జడలు'

'వాలుజడ'

'అయితే చిత్తూబోకూ!'

'ఊఁ—చిత్తూబోకూ!'

* * * *

పదకొండున్నర గంటలకు ఇంటర్వ్యూ పూర్తి అయింది. టైపిస్టు వేకెన్సీవుంది ఒకటి. దానికి అరుణ, విజయలు వచ్చారు. ఆ పోస్టు వీళ్లిద్దర్లో ఎవరో ఒకరికి రావటం ఖాయం. పన్నెండో తారీఖు ఉదయం పది గంటలకు ఫలితాలు చెప్పుతాము. ఆరోజు వచ్చి కనిపించండి అన్నారు. మొత్తానికి అరుణ, విజయలు తమ కిచ్చిన మేటరును బాగానే టైపు చేశారు. చక్కగా టైపు చేశామనే సంతృప్తి ఇద్దరికీవుంది. మరి ఎవరికి ఆఉద్యోగం ప్రాప్తం ఉన్నదో?

స్నేహితురాళ్లు ఇద్దరూ స్కూలు సంగతులు, మిగిలిన తమ క్లాసుమేట్సు సంగతులు చెప్పుకుంటూ రోడ్డుమీదకు వచ్చారు.

'మరి నీవు ఎం. బి. బి. యస్. చదివి, డాక్టర్ను అవుతాను అనేదానివిగా విజీ!' ప్రక్కగా దూసుకుపోతున్న చిన్న కారును తప్పుకుంటూ అడిగింది అరుణ.

'చదువుదామనే అనుకున్నా. చదివిందిచాలు, కాలేజి చదువులు వద్దేవద్దు' పెళ్లి చేసేయ్యండని అమ్మ గొడవ పెట్టటం మొదలు పెట్టింది. సరే, అమ్మపోరు పడలేక, నాన్నగారు సమ్మంధాలు వెతకటం మొదలుపెట్టారు. లాస్టియర్ జబ్బుచేసి నాన్నగారు పోయారు. ఇప్పుడు మామయ్య సమ్మంధాలు వెతుకుతున్నాడనుకో! ఇంటివద్ద లేజీగా కూర్చోవటమెందుకు—ఈలోపల సరదాగా ఈ ఉద్యోగంవస్తే చేద్దామని వచ్చా. మరి నీ సంగతేమిటోయ్ అరు!' నవ్వుతూ అడిగింది విజయ.

'నా సంగతా? ఏముంది—ఇంట్లో అంతా చదవమన్నారు. కాని, నాకే ఏం చదువులులే అనిపించింది. నో అన్నా. పోనీ, పెళ్ళి చేసికోమన్నారు. నాకే, ఏం పెళ్ళిలెద్దూ అనిపించింది. నవల్సు, పత్రికలూ చదువుతూ కూర్చోటమంటే సరదా. అలా రెండు సంవత్సరాలు గడచిపోయాయి. ఇంట్లో గోళ్లు గిళ్లుకుంటూ, ఆ పుస్తకాలు చదవకపోతే పోని ఏదయినా ఉద్యోగం చెయ్యరాదా అని అన్నయ్య గొడవ. (నవ్వుతూ) ఏం ఉద్యోగంలే అనిపించిందనుకో, అయినా చేసి చూద్దామని, ఉబుసుపోక ఈ ఇంటర్వ్యూకు వచ్చాను.'

'ఊఁ—మొత్తానికి అమ్మాయిగారు వేదాంతంలో పడ్డారన్నమాట. కొంపదీసి ఏం జీవితమో లెద్దూ అని కృష్ణలో దూకేవుసుమా!' చలాకీగా అరుణవీపుమీద చరుస్తూ అంది విజయ.

చురుక్కుమన్న వీపును నిమురుకుంటూ, 'నీవు స్కూలు విజీవే! ఏం మార్పులేదు' అంది.

'చాల మార్పు వచ్చిందిగాని, మళ్లీ నిన్ను చూడగానే స్కూలు విజిని అయిపోయా'

విజయ గొంతులో ఏదో క్రొత్తదనం కనిపించిన అరుణ కొంటెగా, 'చాల మారానంటున్నావు. కొంపదీసి అమ్మాయిగారు 'ప్రే—ప్రే—ప్రే......' అనబోయేదానికి సమాధానంగా—

'ఏయ్—' అంటూ విజయ చేయి పైకెత్తింది.

అలా మాట్లాడుకుంటూ ఇద్దరూ గవర్నరుపేట సెంటరుకు వచ్చారు. అరుణ సత్యనారాయణపురానికెళ్లేమూడో నెంబరు బస్సు, విజయ గుణదలకువెళ్లే రెండోనెంబరు బస్సు కూడబలుక్కున్నట్లు ఎంతసేపటికీ సెంటరువయిపు రాలేదు.

'మీరు నూజివీడునుండి ఎప్పుడు వచ్చేశారు?' విజయ అడిగింది.

'మేమా, మేంవచ్చి సంవత్సరం దాటింది. అన్నయ్యకు ఈ వూరు ట్రాన్స్ఫరయితే అంతా వచ్చేశాం. మరి మీరెప్పుడు వచ్చారు?'

'నాన్నగారు పోయిన తర్వాత, కొన్నాళ్లపాటు వూరు మారితే అమ్మ విచారమన్నా తగ్గుతుందని మామయ్యే ఇక్కడ తనింటికి తీసుకువచ్చాడు'

స్నేహితురాళ్లు ఇద్దరూ ఒకళ్ల అడ్రసు ఒకళ్లు తీసుకున్నారు.

'ఎప్పుడయినా మా ఇంటికి రావోయ్ విజి. సరదాగా కబుర్లు చెప్పుకుందాం' అంది అరుణ.

'ఈరోజు ఎనిమిది. పన్నెండో తారీఖున మళ్లీ ఎలాగూ కలుస్తాంగా—'

'కలుస్తాం అనుకో—'

ఇంతలో మూడోనెంబరు బస్సు వచ్చింది. అరుణ బస్సు ఎక్కి వెళ్లిపోయింది. విజయ రెండో నెంబరు బస్సుస్టాపు వయిపు నడిచింది.

మర్నాడు అరుణకు ఒక కవరు వచ్చింది. తనకు ఉత్తరం ఎవరు రాశారా అనుకుంటూ కవరుచింపి ఉత్తరం బయటికి తీసింది.

ప్రియమైన అరూకు!

నిన్న మనం ఇద్దరం కలిసిన తర్వాత, ఇంటికివచ్చి ఈ ఉత్తరం రాస్తున్నాను. ఇప్పుడు నేను రాయబోయే విషయాన్ని నిన్న మనం కలిసినప్పుడు నీతో చెప్పటానికి ఎన్నిసారులో ప్రయత్నించి చెప్పలేకపోయాను. నోటిదాకవచ్చి ఆగిపోయింది. అర్థంలేని అభిమానం అడ్డువచ్చి పడింది. ఈ అర్థంలేని అభిమానం ఈనాటిదికాదు! స్కూలులో మన స్నేహం మొదలయిననాటినుంచి ఉన్నది. ఈ అభిమానం ఎప్పట్నుంచి ఎలా నాలో తావు జేసుకుందో నాకే తెలియదు. మన ఆడవాళ్లకే ఈ అభిమానాలు ఎక్కువనుకుంటాను.

మన చిన్నప్పుడు, 'పండుగకు మందు సామానులు ఏవేవి కాల్చావు విజీ!' అని దీపావళి పండుగ మర్నాడు నీవు అడిగినప్పుడు 'ఏవీ కాలవలేదు—మానాన్న ఏమీ తీసుకురాలేదు. చుట్టుప్రక్క యిళ్లవాళ్లు కాలుస్తుంటే చూస్తూ కూర్చున్నాను' అని నిజం చెప్పటానికి ఈ అభిమానమే అడ్డు వచ్చేది. 'ఓ! బోలెడు కాల్చాను' అని బొంకేదాన్ని! 'మా నాన్న నా చిన్నప్పుడే చనిపోయాడు. నాన్నవుంటే ఎంత బాగుంటుంది. ఎన్న

యినా కొనిపెట్టుతాడుకదూ! 'మీ నాన్న మంచివాడేనా, నీకు కొనుక్కోటానికి రోజూ డబ్బు లిస్తాడా?' అని అమాయకంగా నీవు అడిగినప్పుడు—'మానాన్న నాకు డబ్బు లివ్వడు సరికదా నన్ను చూడగానే మండిపోతాడు. రోజూ బాగా త్రాగివచ్చి, మా అమ్మను బండబూతులుతిట్టి, కొట్టి వేధించుకుతింటాడు. మా నాన్ననుచూస్తే నాకు చచ్చే భయం!' అని నిజం చెప్పటానికి ఈపాడు అభిమానమే అడ్డు వచ్చేది. సహజంగా క్రూరుడయిన మా నాన్నను మంచివాడుగా భావించుకుని, మంచి నాన్నలు ఏవేవి చేస్తారో, వాళ్ల పిల్లలను ఎలా చూస్తారో వూహించుకుని, 'మా నాన్న చాల మంచివాడు' నా కని కొనిపెట్టుతాడు—ఇవి కొనిపెట్టుతాడు' అని చెప్పేదాన్ని! తర్వాత అనుకునేదాన్ని—నిజం ఏం చెప్పుతే ప్రాణంపోతుందా? ఎందుకిలా అబద్ధాలు చెప్పటం అని. ఎప్పటికప్పుడు ఇకనయినా నిజం చెప్పాలి అనుకునేదాన్ని. కాని, అదేం ఖర్మో మనం కలుస్తేచాలు గొప్పలు చెప్పుకునేదాన్ని. అందాక ఎందుకు, నిన్నమాత్రం నిన్న నీవు కలిసినప్పుడు, నీవు నా చదువు ప్రసక్తి ఎత్తినప్పుడు నిజం చెప్పుదాం అనుకున్నా. చెప్పలేకపోయాను. మళ్లీ నిన్ను చూడగానే స్కూలు విజీని అయిపోయాను అన్నాను. గుర్తుందా? నా ఈ బలహీనతకు ఏడవాలో, నవ్వాలో నాకే అర్థం కావటం లేదు.

ఇప్పుడుమాత్రం మా యధార్థస్థితి అంతా చెప్పి, నీ సహాయాన్ని అర్థించాలని నిశ్చయించుకునే ఈ ఉత్తరం రాస్తున్నాను. నాకు చిన్నప్పట్నుంచి, నేను డాక్టరుకోర్సు చదివి లేడీ డాక్టరును కావాలని కోరిక ఉండేది. కాని, నాకు ఎస్సెస్సెల్సీ వరకే రాసిపెట్టివుంది. అది పూర్తి అవటమే గగనమయిపోయింది. అప్పటికే త్రాగుడువల్ల మా నాన్న వళ్లూ, ఇళ్లూ గుల్లయిపోయింది. ఒకసారి వళ్లు తెలియకుండా త్రాగి లారీ కిందపడ్డాడు. వారం రోజులు ఆసుపత్రిలో బాధపడి చనిపోయాడు. నాన్న చనిపోయిన వార్తవిని మామయ్య వచ్చాడు. ఉన్నయిల్లు తెగనమ్మి నాన్న జేసిన అప్పులుతీర్చి అమ్మనూ, నన్నూ తన ఇంటికి తీసుకొచ్చాడు. మేం ఇక్కడకువచ్చి ఆరు నెలలు అయిపోయింది. మామయ్యకూ ఆస్తిపాస్తులు ఏమీ లేవు. ఆయన చేస్తోన్న తొంభై రూపాయల ఉద్యోగమే ఆధారం! చాలీ చాలని జీతం గంపెడు పిల్లలు. దానికితోడు మేం ఇద్దరం వచ్చాం. మామయ్య పిల్లల చాకిరి నేను, ఇంటికి చాకిరి అమ్మ చెయ్యాలి. అత్తయ్య సాధింపులో అమ్మనూ, నన్నూ నూటిపోటి మాటలు అంటుంది. నేను స్కూలుఫైనలు వరకు చదివాను. నాకేదయినా ఉద్యోగంవస్తే మన తిండి మనం తినవచ్చునని అమ్మ ఆశ! మామయ్య మమ్మల్ని ఇక్కడకు తీసికురావటంలో ఉద్దేశం కూడ ఇదే! ఈ పరాయి పంచల బ్రతుకు, మామయ్యకు భారం కావటం, అత్తయ్య ఎత్తి పొడుపు మాటలు, ఈ గొడ్డు చాకిరి——వీటన్నిటిమధ్య మిణుగు మిణుగుమనే ఆశ ఈ ఉద్యోగమే! ఈ వూరు రాగానే ఎంప్లాయిమెంటు ఏక్ఛేంజిలో పేరు రిజిష్టరు చేయించాను. నిన్న ఈ కంపెనీలో టైపిస్టు ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంటూ, ఈ ఉద్యోగం నాకే రావాలని కోరుకుంటూ వచ్చాను. అంతేగాని, నిన్న నీతో బొంకినట్లు ఇంటివద్ద లేజీగా ఉండటమెందుకని సరదాగా రాలేదు. ఈ ఉద్యోగం కూలిపోయిన మా సంసారాన్ని నిలబెట్టే ఒకే ఒక ఆధారం! మా కడగండ్ల బ్రతుకు కొంచెమయినా మారాలంటే ఈ ఉద్యోగమొక్కటే ఆశ !

ఇదీ నా స్థితి! నీవు నాకంటె ఎంతో అదృష్టవంతురాలివి. అసలు నీకు ఈ దురదృష్టవంతురాలితో పోలిక ఏమిటి? నీవు గొప్పింటి బిడ్డవు. ఏ బాధలులేవు. ఏదో ఉబుసుపోక ఉద్యోగం చెయ్యటానికి వచ్చావు. నీకు ఈ ఉద్యోగం చెయ్యవలసిన ఖర్మలేదు. నా విషయంలో మాత్రం ఇప్పు డీ ఉద్యోగం దొరకకపోతే, మా పరిస్థితి ఎంత విషమంగా పరిణమిస్తుందో నీవే వూహించు. దైవికంగా నా బాల్య స్నేహితురాలివయిన వీవు, ఈ ఉద్యోగపు పోటీలో నాకు ప్రత్యర్థినివిగా నిలబడ్డావు. ఇదీ నా అదృష్టమే అనుకుంటూ. ఎందుకంటే, నీ స్థానంలో వేరే ఇంకొకళ్లువుంటే, వాళ్లను ఇలా అర్థించే అవకాశం నా కుండదు. నీవు ఈ పోటీనుంచి విరమించుకుని, ఒక చితికిపోయిన సంసారాన్ని చక్కపరచిన పుణ్యం కట్టుకో. నీ బాల్య స్నేహితురాలి భవిష్యత్తు అంతా నీ చేతుల్లోనేవుంది. నా కీ సహాయాన్ని తప్పకుండా చేస్తావని నమ్ముతున్నాను. నీ హృదయం నాకు తెలుసు. నీవు తప్పక చేస్తావు. నీవుచేసే ఈ మేలును నా జీవితంలో ఎప్పటికీ మరచిపోను.

మరొకసారి నీ సహాయ సానుభూతులను అతిదీనంగా అర్థిస్తూ—

నీ విజి.

*　　*　　*　　*

ఉత్తరం చదవటం పూర్తిఅయేసరికి అరుణ కనుకొలకుల్లో రెండు కన్నీటిబొట్లు నిలిచాయి. భారంగా నిట్టూర్చి విషాదంగా నవ్వుకుంటూ ఆ ఉత్తరాన్ని మడిచింది.

*　　*　　*　　*

'ఏయ్ పెద్దమ్మడు. ఇట్లారావే. విన్నేనే! ఈ కవరు తీసికెళ్లి ఆ విజయమ్మగారికియ్. ఉత్తరం వచ్చిందని ఇయ్. ఎవరు రాశారా? నాకేం తెలుసు? ఆవిడగారి కెవరున్నారో ఏమో'

సావిట్లోంచి అత్తయ్య అనే మాటలు పూర్తికాకుండానే పెద్దమ్మడు తెచ్చియిచ్చిన కవరు తీసుకుని, వణుకుతున్న చేతు

లతో చింపి, దడదడ కొట్టుకుంటున్న గుండెలతో చదవటం మొదలుపెట్టింది విజయ.

విజికి—

నిన్ననే కలసి, అంతసేపు అన్ని విషయాలు మాటాడి, మళ్లీ ఇవ్వాళ ఈ ఉత్తరం ఏమిటా అని ఆశ్చర్యపోకు. కొన్ని విషయాలు ముఖతః చెప్పలేక ఇలా ఉత్తరం ద్వారా చెప్పు తున్నాను.

నీకు గుర్తుందా? మనం ఫిఫ్తుఫారం చదువుకున్నప్పుడు మనస్కూల్లో ఒకసారి 'ఆడవాళ్ల స్నేహాలు' అనే విషయం మీద డిబేటు జరిగింది. ఆ డిబేటులో రాజారావనే స్కూల్ ఫైనల్ స్టూడెంటు మాటాడుతూ.......మగవాళ్లల్లో ఇద్దరు ఫ్రెండ్సు కలిసినప్పుడు ఎంతో సహృదయంతో నిర్మలంగా వున్న సంగతులు ఉన్నట్లుగా మాట్లాడుకుంటారు. అదే ఇద్దరు ఆడవాళ్లు మాటాడుకుంటుంటే వాళ్లమాటల్లో మనకు కనిపించేది గర్వం, డాంబికం, ఒకళ్ల గొప్పలు ఒకళ్లు చెప్పుకోటం — వాళ్ల మాటల్లో 'అతి' మితం లేకుండా ఉంటుంది. ఉదాహరణకి ఒకామె తన స్నేహితురాలు కట్టుకున్న చీరనుచూచి, 'బాగుందోయమ్మా! ఎంతకు కొన్నావ్?' అని అడిగిందనుకొండి. ఆ చీరామె తప్పీమని తడుము కోకుండా 'ముప్పైఅయిదు రూపాయిలు' అంటుంది. నిజానికి అది పన్నెండు రూపాయల చీర. పోనీ, అలా అని వూరుకుంటుందా? ఉహూ—' అలాటి చీరలు ఇప్పుడు ఎక్కడా దొరకటం లేదు. మద్రాసులోనే ఉంటాయిట. ఇప్పుడు అక్కడా దొరకటం లేదుట. ఆమధ్య మా నాన్నగారు మద్రాసు వెళ్ళినప్పుడు ఒక కొట్లో చూశారట. ఆ కొట్లో ఇలాటివి రెండు అంటె రెండే ఉన్నాయుట. నా కొకటి, మా అక్కయ్య కొకటి అని తీసికొచ్చారు. ఈ చీరలుచూచి, మా వదినె చెల్లెలు వాళ్ల అన్నయ్య మద్రాసు వెళ్తున్నప్పుడు ఇలాటివే తీనుకురమ్మందిట. టాక్సీ మీద వూరంతా తిరిగినా ఎక్కడా దొరకలేదట......' ఇలా చెప్పుకుపోతారు. నిజానికి అది అసలు ఏ వేలంపాట బాపతో అయివుంటుంది. మరి ఎందుకు ఆడవాళ్లు ఇలా గొప్పలు చెప్పుకుంటారో అర్థం కాకుండావుంది......అని, అతను అన్నప్పుడు మనమంతా అతడ్ని తిట్టిపోశాం. కాని, అతను అన్న మాటల్లో నిజంలేకపోలేదని ఇప్పుడనిపిస్తుంది. మన ఆడవాళ్లు ఎందుకు గొప్పలు చెప్పుకుంటారో నాకూ అర్థం కావటంలేదు. ఎవరో దాక ఎందుకు. నా విషయం తీసికో. నామటుకు నాకు చిన్నతనంనుంచి ఇలా గొప్పలు చెప్పుకోటం అలవాటయిపోయింది. మనస్సువిప్పి వున్న యదార్థాన్ని ఎవరికీ చెప్ప బుద్ధేయదు. అందులోనూ, ముఖ్యంగా మన స్నేహితురాళ్ల దగ్గర, ఎవరోదాక ఎందుకు—అన్ని సంవత్సరాలు నీతో కలిసి మెలిసి చదువుకుని ఒకే బెంచిమీద ప్రక్క ప్రక్కన కూర్చుని, స్కూలులో ఉన్నంతసేపు ఒక్కక్షణమయినా ఒకళ్లను ఒకళ్లు విడవకుండా ఉంటూ కూడ, ఏనాడూ నీతో నా యధార్థస్థితి చెప్పలేదు. నేను చెప్పేమాటలనుబట్టి, మా దొక రాయల్ ఫామిలీ అనుకొన్నావుకదూ! అవును పాపం, నేను ఏది చెప్పితే అది నమ్మేదానివి. మాది పెద్ద బంగళా—మాకు కారువుంది—ఇంటినిండా సోఫాలు, కుర్చీలు, బొమ్మలు ఉన్నాయని చెప్పేదాన్నికదూ! నీవు అవన్నీ నిజమే అనుకుని, 'మీ యింటికి నన్నొకసారి తీసికెళ్లవోయ్!' అని అమాయకంగా అడిగేదానివి! నిన్ను మా ఇంటికి తీసికెళ్ళితే, ఎక్కడ మా రంగు బయటపడుతుందోనని ఎప్పటి కప్పుడు ఏదో సాకులు చెప్పేదాన్ని. మాదొక రాయల్ ఫామిలి అనే భ్రాంతిని నీకు కలిగించేదాన్ని. నిజానికి మాది ఒక చితికిపోయిన మధ్యతరగతి కుటుంబం. మా నాన్న నా ఎనిమిదోయేట పోయాడు. ఉన్న రెండు ఎకరాలు అన్నయ్య చదువుకు, నా చదువుకు హరించుకుపోయాయి. ఇప్పుడు అన్నయ్యకు వంద రూపాయల జీతం. ఇందులోనే ముప్పై రూపాయల ఇంటి అద్దె ఇస్తూ, ఈ విజయవాడ మహానగరంలో అన్నయ్య, వదినె, అమ్మ, నేను, చెల్లెలు, దాని తర్వాత తమ్ముడు బ్రతకాలి. ఎలా బ్రతకాలో నీవే ఆలోచించు!

నిన్న నీ దగ్గర కోసినట్లు నన్ను ఎవరూ కాలేజి చదువులు చదువ మనలేదు. పెళ్ళి చేసుకోమనలేదు—నేను వద్దు వద్దు అని అనాలేదు. రోజు గడవటమే కష్టమయిపోతుంటే ఇంక పెళ్లేమిటి నా మొగం.......ఎస్సెస్సెల్సీవరకు చదివానుకదా, ఏదయినా ఉద్యోగంచేసి అన్నయ్యకు సహాయంగా ఉండామని ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజిలో పేరు రిజిష్టరు చేయించి, టైపు నేర్చుకున్నాను. నిన్న ఇంటర్వ్యూ వచ్చింది. నీవు కలిశావు. నీవు ఇంటివద్ద లేజీగా ఉండటం దేనికని ఈ ఉద్యోగం వస్తే చేయటానికి వచ్చావు. కాని, నేను నా ఆశలు, మా కుటుంబపు భవిష్యత్తు అన్నీ దీనిమీదే నిలుపుకుని వచ్చాను.

నీవు పెట్టి పుట్టిన దానవు. నీకు ఏ చీకూ, చింతాలేదు. అన్ని విధాల ఆదుకోగలిగిన మీ మామయ్య ఉన్నాడు. నీవు ఈ ఉద్యోగమే చేయాలనిలేదు. నీవు ఈ కాంపిటీషనునుండి విరమించుకుంటె నాకీ ఉద్యోగం వస్తుంది. నీ చిన్ననాటి స్నేహితురాలకు ఈమాత్రం సహాయం చెయ్యలేవా? చేస్తావు. తప్పకుండా చేస్తావు. నీ మనసు నాకు తెలుసు.

సిగ్గు విడిచి నీకు ఇంకో విషయం చెప్పుతున్నాను. మేము ఉంటున్న వీథిలో ఒక మిల్లు యజమాని ఉన్నాడు. వాడికి వాణ్ణి

తగలేసేంత డబ్బువుంది. వాడు నామీద కన్నేశాడు. నేను టైపు ఇనిస్టిట్యూటుకు పోవాలంటె వాడి ఇంటిముందు నుంచే పోవాలి. వచ్చేటప్పుడు, పోయేటప్పుడు నా వంక కళ్లతో త్రాగేసేటట్లుగా చూస్తాడు. మా బీదస్థితి అంతా తెలుసుకుని, ఒకసారి ఒక ముసలమ్మతో—నేను వాడికోర్కె తీరిస్తే, నేను కోరినంత డబ్బు ఇస్తానని కబురు పంపాడు. ఆ కబురు తెచ్చిన ముసలిదాన్ని నేను నానా తిట్లు తిట్టి, ఈ తడవ మళ్లీ ఇలాటి కబుర్లుతెస్తే మా అన్నయ్యతోచెప్పి ప్రాణం తీయిస్తాను అని బెదిరించాను. చూడు విజీ! మేం బీదవాళ్లమనేగా ఆ వెధవ, నేను డబ్బుకు కక్కుర్తి పడ్తాను అని అంత ధైర్యంగా కబురు పంపాడు!

ఈ బాధలు చాలవన్నట్లుగా అమ్మకు ఈమధ్య టి. బి. వచ్చింది. వదినెకు వంట్లో బలం చాలక, బలహీనంవల్ల కడుపు తర్వాత కడుపుపోతోంది. రోజు రోజుకు దిగజారుతున్న మా కుటుంబంకోసం, ఆఖరుకు ఆ మిల్లు యజమానిగాడు చూపిన ఆశకు కక్కుర్తి పడవలసిన రోజు వస్తుందేమోననిపిస్తోంది విజీ! వద్దు విజీ.......వద్దు.......అలాటిరోజు రావద్దు. నాకీ ఉద్యోగంవుంటె మాకు ఇంకే బాధ ఉండదు. నాకీ విపత్కర పరిస్థితుల్లో సహాయపడలేవా? నన్ను ఆ హీనస్థితికి దిగజారనీయకు విజీ! ఇంతకంటె ఎక్కువ ఇంకేం రాయను? ఉన్నది ఉన్నట్లు రాశాను. ఆ తర్వాత నీ యిష్టం.

ఇక ఉంటాను.

నీ అరూ.

* * * *

పన్నెండవతేది వచ్చింది. కాని, అరుణ, విజయలు ఇద్దరూ ఆ కంపెనీకి రాలేదు. ఇద్దరు దగ్గర్నుంచి కంపెనీ మేనేజరుకు ఉత్తరాలు వచ్చాయి. నాకీ ఉద్యోగం అక్కర్లేదు, రెండవ ఆమెకు ఇవ్వమని. ఆ రెండు ఉత్తరాలుచూచి అందరూ ఆశ్చర్యపోయారు. ఆఫీసులోని యువక కారంతా నీళ్లు కారిపోయారు. 'ప్రేమా రావు' కసిగా, 'నే నప్పుడే అనుకున్నా—ఇవి ఉద్యోగాలుచేసే ముఖాలు కావని—' అన్నాడు.

కాని ఆ ఉత్తరాల వెనుక ఏముందో వీళ్లందరికి ఏం తెలుసు?